# ఒకే ముఖం
## చందలూరి నారాయణరావు

ఈ పాపపు లోకంలో
మనిషిని టచ్ చేసి
మనసును ముద్రించే మిషనొకటి వస్తే?

మనసు మధ్యలో నిలబడి
ఎవరు చేసిన తప్పులను
వాటి శిక్షలను తెలుసుకొనే
ఎవరికి వారే పాస్ వర్డ్ గా
ఒక సాంకేతికత కనిపెడితే?

ప్రతి ఒక్కరిలో
ఒకే ముఖం, ఒకే మనిషిని కలిగి
లోకం ఎంత అందముగా కనిపిస్తుందో?

సమస్యలు పరిష్కారాలు చుట్టు
ఏళ్ళు తరపడి ప్రదక్షిణాలు లేకుండా
పరిష్కారమే సమస్యకు
పాదాభివందనం చేస్తే?

భూమికి మనిషి దిగులుండదు
సృష్టిలో చెడు చెద కనపడదు.

★★★

# చావుని ప్రేమిస్తూ..
## శ్రీసాహితి

ఈ కాలంలో
కోరికలే శత్రువులుగా
ప్రేమించేది యుద్ధాన్నే.

అంతరంగమే
యుద్ధరంగంగా
మేధస్సే ఆయుధమై

రంగుల వ్యూహాలతో
నిజాన్ని నటిస్తూ
ముసుగులల్లి

చుక్క నెత్తురు చిందని
చావుని ప్రేమిస్తూ
బతకడమే జీవితం.

★★★

# విచిత్రం

గాయత్రి భోగవల్లి

ఈ సాయంత్రం -
నిర్దయగా
తన్ను వీడి వెళ్ళిపోతూన్న
సాయంసంధ్య చేసిన గాయానికి
సూర్యుని హృదయం స్రవించిన రుధిరం
సంజవెలుగుల జల్లుగా కురిసి
జాలితో ముడుచుకొన్న మందారాల చివరల నుండి
నేలకు జారి మట్టిలో ఇంకిపోతూంది..!!
అందుకేనేమో -
పెరట్లోని మందారాలూ మట్టీ
అంత ఎర్రగా ఉన్నాయి!
బాధతో రగిలి రగిలి
తుదకు పాలిపోయిన ఆ సూర్యుడేనేమో
తెల్లని బింబమై కార్చిన కన్నీరు
వెన్నెల వెలుగుల జల్లుగా కురిసి
క్రిందనున్న లోకానికి మంచుపూత పూయసాగింది
అందుకేనేమో -
సాయంత్రం నే చూచిన లేబసరువన్నె జాజి మొగ్గలు
ఇపుడింత తెల్లగా విరిశాయి!!

★★★★

# రసరేఖలు

## శ్రీధర్ బచ్చోటి

ప్రేమ కనరానిదెచ్చటో విశ్వమందు?
ఎప్పుడైనను, యెట్లైన, యెచ్చటైన
ఎవరొ యెవరినో తాము ప్రేమించుచుండ్రు
ఎలమినెరుగని పుడమినూహించగలమె?

హృదయమిచ్చుటయందు ప్రాప్తించు తృప్తి
తిరిగి ప్రేమను పొంద సిద్ధించు రక్తి
ఎడదననురాగబిందువులింకిపోవ
అంతరంగము మరుభూమి యగును గాదె!

ఎల్లవేళల ప్రేమనందింపవలయు
అందజేయు వారు తిరిగి పొందగలరు
పొందు భాగ్యము మనలకు చెందకున్న
ప్రేమనెరుగక బ్రతుకెల్ల బీడువారు

నుడువుచుందురు ప్రేమికులెడము కాగ
ఇనుమడించును ప్రేమ వేయింతలంచు
సత్యమైననొక్కింత యసత్యమౌను
దూరమైనచో రాగముల్ దూరమౌను

ఎలమి గానక మానసమెండిపోవ
మరల చిగురింప బహుకష్టతరము కాదె!
గృహములోనికి ప్రసరించు కిరణములను
ఆర్పివైచిన మరల లభ్యమ్ము కావు

COMMENTS